andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.7 : కనిష్ఠం 20.4
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
సోమవారం 7 జూలై 2025



ట్రాయాథ్లాన్‌లో జిల్లావాసికి సిల్వర్ మెడల్

కామారెడ్డి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ట్రాయాథ్లాన్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన ధనశ్రీ సిల్వర్ మెడల్ గెలిచిందని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలో ఆదివారం తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాండింగ్ బ్రాడ్ జంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు.

- జిల్లాలో పలుచోట్ల గుంతలమయంగా ప్రధాన రహదారులు
- మరికొన్ని చోట్ల అసంపూర్తిగా రోడ్ల నిర్మాణం
- చాలా చోట్ల మధ్యలోనే ఆగిపోయిన పనులు
- సకాలంలో బిల్లులు మంజూరు కాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- ఇప్పటికీ పల్లెల్లో మట్టిరోడ్లే దిక్కు
- పెండింగ్‌లోనే కేకేవై జాతీయ రహదారి
- మరికొన్నిచోట్ల విస్తరణకు నోచుకోని ప్రధాన రహదారులు
- వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు
- జిల్లాలో రహదారుల పనులపై మంత్రి దృష్టి సారించేనా?
- నేడు జిల్లాలో పర్యటించనున్న రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జుక్కల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి

మంత్రి గారూ..
రోడ్లను బాగు చేయరూ..!



కామారెడ్డి, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన పలు రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. గత ఐదేళ్లుగా రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు కాక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో రహదారుల పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రధాన రహదారుల గుండా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అదేవిధంగా కరీంనగర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి(కేకేవై) జాతీయ రహదారి పనులు ఇప్పటికీ మొదలుకాక ఈ మార్గం గుండా అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటూ ప్రాణ నష్టం వాటిల్లుతోంది. ఇక పలు పల్లెలకు ఇప్పటికీ మట్టిరోడ్లే దిక్కు అవుతున్నాయి. వర్షాలు పడితే ఆ పల్లెలకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. జిల్లా రహదారులపై రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టి సారించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం మంత్రి జిల్లాలో పర్యటించనున్నారు. జుక్కల్ నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు.



గుంతలమయంగా ఏర్పడిన కామారెడ్డిలోని రోడ్డు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు ఇలా..

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ పరిధిలో రోడ్డు భవనాల శాఖ పరిధిలో రాష్ట్రీయ రహదారులు 66 కి.మీ.ల విస్తీర్ణంలో ఉండగా ప్రధాన జిల్లా రహదారులు 230 కి.మీ.లలో ఇతర జిల్లా రహదారులు 252 కి.మీ.లలో, జడ్పీ బదలాయించిన రోడ్లు 98 కి.మీలలో, పీఆర్‌కు బదలాయించిన రోడ్లు 274 కి.మీలలో విస్తరించి ఉన్నాయి. ఇక పంచాయ తీరాజ్ శాఖ పరిధిలో బీటీ రోడ్లు 769 కి.మీలు, మెటల్ రోడ్లు 379 కి.మీలు, సీసీరోడ్లు 178 కి.మీలు, మట్టిరోడ్లు 946కి.మీల పరిధిలో ఉన్నాయి.

అస్తవ్యస్తంగా రహదారులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. బీర్కూర్ మండలంలోని టీటీడీ ఆలయం నుంచి బస్వాపూర్ వరకు నాలుగు కి.మీల బీటీ రోడ్డు నిధులు లేక అసంపూర్తిగానే ఆగిపోయాయి. కామారెడ్డి నుంచి రామారెడ్డి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో వాగుపై బ్రిడ్జి పనులు రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నస్రూల్లాబాద్ మండలంలోని దుర్కి నుంచి బీర్కూర్ వరకు గల రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. నెమలి నుంచి బొమ్మన్‌దేవుని పల్లి మధ్యగల రోడ్డు అర్ధాంతరంగా నిలిచిపోయింది. హాజీపూర్ నుంచి బొమ్మన్‌దేవునిపల్లి రోడ్డుకు బిల్లులు రాక కంకర తోనే పనులు ఆగిపోయాయి. గాంధారి మండలంలోని గాంధారి నుంచి పోతంగల్ కుర్దు వరకు 5 కి.మీల మేర ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి నుంచి కామారెడ్డికి వచ్చే ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కాళోజీవాడి నుంచి తాడ్వాయి వరకు ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. జుక్కల్ మండలంలోని పెద్దగుల్ల నుంచి పెద్దగుల్ల తండా వరకు 3 కి.మీల మేర మెటల్ రోడ్డు వేసి వదిలేశారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ నుంచి వెంకంపల్లి వరకు 3 కి.మీల రహదారి గత నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇలా జిల్లాలో పలుచోట్ల రహదారులు ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బిల్లులు మంజూరు కాక మధ్యలోనే నిలిచిన పనులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో రోడ్డు రవాణా సౌకర్యం మెరుగుపడడం లేదు. రోడ్డు రవాణా సౌకర్యాలు మెరుగుపడితేనే అభివృద్ధి బాట పడుతాయి. అందుకే ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణాలకు, అభివృద్ధికి పెద్ద ఎత్తున నిదులు కేటాయిస్తాయి. అవసరానికి అనుగుణంగా మట్టిరోడ్లను కంకర రోడ్లుగా, తారురోడ్లుగా, డబుల్‌రోడ్లుగా అభివృద్ధి చేస్తుంటాయి. అయితే గత ఐదేళ్లుగా రోడ్ల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు అయినప్పటికీ బిల్లులు సకాలంలో చెల్లింపులు కాక కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే ఆపి వేస్తున్నారు. దీంతో రోడ్ల పనులు అసంపూర్తిగా ఉండిపోతున్నాయి. సుమారు జిల్లాలో 25 కోట్లకు పైగా రహదారుల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లింపులు అయితే కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.

(మిగతా 8వ పేజీలో)



బీర్కూర్‌లో..



రైతులకు ఉపయోగపడని గోదాం

- వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటున్న రైతులు
- పూర్తయిన లైసెన్స్ జారీలో అశ్రద్ధ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

7

ఆయిల్ పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- దీర్ఘకాల పంటతో లాభాలు
- ప్రోత్సాహం ఇస్తున్న ప్రభుత్వం
- వర్షాకాలం సాగుకు అనుకూలం

7

అందని గ్యాస్ సబ్సిడీ

- ఖాతాలో జమ కాని రాయితీ
- మహాలక్ష్మీ లబ్ధిదారుల ఆందోళన
- బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు



రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులో నా భర్తను ఇరికించారు

- పేలుడు పదార్థాల నిల్వ కేసులో నా భర్త చంద్రశేఖర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదు
- శ్రీవారి వెంచర్స్‌ను ఎప్పుడో విబుస్ వెంచర్స్ వారికి అప్పగించాం
- నా భర్త పేరిట గుంట భూమి లేదు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు
- కామారెడ్డి పోలీసు స్టేషన్‌కు పిలిచి అర్ధరాత్రి అరెస్టు చేసి జైలుకు తరలించారు
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతోనే తప్పుడు కేసులో నా భర్త టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని ఇరికించారని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో కష్టపడి తాము పనిచేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు తన భర్త చంద్రశేఖర్‌రెడ్డికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టారని తెలిపారు. పేలుడు పదార్థాల నిల్వ కేసులో నా భర్తకు ఎలాంటి సంబంధం లేదని కక్షపూరితంగా వ్యవహరిస్తు సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని సమయం వచ్చినప్పుడు బట్టబయ లు చేస్తామని తెలిపారు. గత మూడు రోజుల నుంచి కేపీఆర్ కాలనీలోని ఫ్రోబెల్స్ స్కూల్ పక్కన పేలుడు పదార్థాలు లభించడంతో శ్రీవారి వెంచర్‌కు లింక్ చేసి తన భర్త గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని ఇరికించారని తెలిపారు. అసలు శ్రీవారి వెంచర్‌లో గుంట భూమి కూడా లేదని ఎప్పుడో విబుస్ వెంచర్స్ వారికి అప్పగించామని తెలిపారు. అందుకు సంబంధించిన ప్రూఫ్‌లు కూడా మా వద్ద ఉన్నాయని తెలిపారు. కామారెడ్డి పోలీసుస్టేషన్‌కు పిలిచి అక్కడి నుంచి బిచ్కుందకు తరలించి అర్ధరాత్రి అరెస్ట్ చేసి జైలుకు తరలించారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నా భర్తను తీసుకెళ్లారు. సమగ్ర విచారణ జరిపి పోలీసులు తమకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ఎప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటు పడుతామని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆశీ స్సులు మాకు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్‌లు కృష్ణమూర్తి, మమత, జూలూరి సుధాకర్, రవి, సలీం, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

బిచ్కుంద, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద డొంగ్లీ రోడ్డు శిలాఫలకం ఆవిష్కరణ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. మంత్రి పర్యటన సందర్భంగా సంబంధితశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరణ ప్రదేశాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

జ్వరం.. భయం



కామారెడ్డి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): అసలే వర్షాకాలం అందులోనూ అడపాదడప వర్షాలు పడుతున్న సమయం. గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడికక్కడ నీటి నిల్వలు, మురికి కాలువలో పేరుకపోయిన మట్టివల్ల నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమలు గుడ్లు పెట్టడం వాటి సంతతిని పెంచడంతో జిల్లాలో దోమకాటు వ్యాధులు ఎక్కువవుతున్నాయి. పరిసరాల అపరిశుభ్రతను ప్రజలు విస్మరించడం, స్థానిక సంస్థల సిబ్బంది అంతంత మాత్రంగానే దృష్టి సారించడంతో వ్యాధులు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా మలేరియా, డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గత రెండ్రోజుల క్రితం నిజాంసాగర్ మండలంలో డెంగీ కేసు నమోదైంది. గత 6 నెలల కాలంలో జిల్లాలో మొత్తం 15 కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇవికాక అనధికారికంగా నమోదైన కేసులు ఎక్కువగానే ఉంటున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. పల్లె, పట్టణాల్లో దోమల నివారణకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపడితేనే దోమకాటు రోగాల నుంచి ప్రజలకు రక్షణ కలుగుతుంది.

- పరిసరాల అపరిశుభ్రతతో పెరుగుతున్న దోమల సంతతి
- అవగాహన లేక విస్తరిస్తున్న వ్యాధి
- గత 6 నెలల్లో జిల్లాలో 15 డెంగీ కేసుల నమోదు
- రెండు రోజుల కిందట నిజాంసాగర్ మండలంలో డెంగీ కేసు నమోదు
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సిందే..



జిల్లాలో 15 కేసులు నమోదు

జిల్లా వ్యాప్తంగా గత 6 నెలల కాలంలో 15 డెంగీ కేసులు నమోదు అయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారిక లెక్కలు తెలుపుతున్నాయి. నిజాంసాగర్ మండలంలోని వడ్డెపల్లి గ్రామంలో ఓ 14 సంవత్సరాల బాలుడు డెంగీ భారిన పడ్డాడు. ప్రతీసారి డెంగీ కేసులు నమోదు అవుతున్న ప్రాంతాల్లో ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాలకు చెందిన ప్రాంతాలే ఎక్కువగా ఉంటున్నాయి. గత సంవత్సరం 25కు పైగా డెంగీ కేసులు నమోదు కాగా అందులో మద్నూర్, డోంగ్లీ మండలానికి చెందిన ప్రాంతంలోనే ఎక్కువగా బాధితులు ఉన్నారు. ఈ ప్రాంతాల్లోనే ఎక్కువగా నమోదు కావడానికి కారణం ఆ పరిసర ప్రాంతాల్లో డ్యాంలు ఉండడం నీటి నిలువలు ఉండడం అని వైద్యాధికారులు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లోకి వస్తే కామారెడ్డి పట్టణంలోనూ ప్రతీ ఏడాది ఎక్కువగా కేసులు నమోదు అవుతున్నాయి. బతుకమ్మ కుంట, హరిజనవాడ, అయ్యప్పనగర్, గొల్లవాడ, టీచర్స్ కాలనీ, ఇందిరానగర్, రాజానగర్, రాజీవ్ నగర్, గుమస్తాకాలనీ, వాంబే కాలనీ, సైలాన్‌బాబా కాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిలవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. ఈ ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా లాంటి దోమకాటు వ్యాధుల భారిన పడుతున్నారు.

డెంగీ లక్షణాల గుర్తింపు

ప్రాణాంతక వ్యాధి అయిన డెంగీ సోకడానికి కారణం

(మిగతా 8వ పేజీలో)

హిందూ సమాజం సంఘటితంగా ఉండాలి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంఘటన ప్రముఖ్ త్రివిక్రమ్

కామారెడ్డి టౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజం ఎల్లప్పుడూ సంఘటితంగా ఉండాలని హిందూవాహిని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ సంఘటన ప్రముఖ్ త్రివిక్రమ్ అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో హిందూ సింహగర్జన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన దేవాలయాలు, మన దేశాన్ని, మన సంప్రదాయాలను ఎల్లప్పుడూ రక్షించే బాధ్యత మనదేనని తెలిపారు. మాదకద్రవ్యాలను సమాజం నుంచి పారదోలే విధంగా ఒక ఉద్యమంలా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సంఘటన ప్రముఖ్ యాదిరెడ్డి, సహ సంయోజక్ మల్లికార్జున్, ఆర్ఎస్ఎస్ జిల్లా సంచాలక్ శంకర్, జిల్లా సంయోజక్ సాయి కారణ్, తరుణ్, దినేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న త్రివిక్రమ్

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మిత్రమండలి సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జూలై.6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయవృత్తి పవిత్ర మైనదని మిత్ర మండలి సభ్యులు ఖాందేష్ శ్రీనివాస్, గుజరాతి నివేధన్, ప్రవీణ్‌పవార్, డీజేదయానంద్ అన్నారు. ఆర్మూర్ పట్టణం మామిడి పల్లిలో ఆదివారం ఇటీవల క్షత్రియ సమాజ్‌కు చెందిన పలువురు ప్రభు త్వ ఉపాధ్యాయులుగా నియమితులైన సందర్భంగా క్షత్రియ సమాజ్ , మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్షత్రియకులస్థులైన యువతియువకులుపట్టుదలతో చదివి ప్రభుత్వఉపాధ్యాయులుగా నియమితులు కావడం సంతోష కర మన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని క్షత్రియ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత స్థానంలో నిలవాలని అన్నారు.అనంతరం నీట్‌లో జాతీయ స్థాయి ర్యాంక్ సాధించిన పవార్ కృపనక్షత్రతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులైన విశ్వనాథ్, రాజరాజేశ్వరి, కర్తన్ అఖీల, నాగశ్రీ, గట్టడిగీత, చౌల్ శ్రీనివాస్, దినేష్, గటడి రామకృష్ణ, హజారి జగనాథ్, కోడె శ్రీనివాస్‌లను శాలువ, మెమెంట్‌లతో సన్మానిం చారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత, పవార్ అభింకా, ఆనంద్‌శ్రీనివాస్, గంగకిషన్, రాజు,రాజేశ్, వేణు, ప్రవీణ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న టీయుసీఐ రాష్ట్ర కార్యదర్శి

ఆర్మూర్ టౌన్ , జూలై.6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయుసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. ముత్తెన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను పట్టుబానిసలుగా చేస్తున్న విధివిధానాలకు వ్యతి రేకంగా పోరాటాన్ని పోరాడాలని పిలుపునిచ్చారు. కాంట్రాక్టు, ఓట్‌సోర్సింగ్ పద్దతిలో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు కనీసపెన్షన్ ఇవ్వాలని, పాత పెన్షన్ పతకాన్ని పునరుద్ధరించి ఎన్‌పీఎస్, యూపీఎస్‌ను రద్దు చేయా లని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశా రు.ఈ కార్యక్రమంలో పీయూ సీఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, నిమ్మల నికిల్, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఈ నెల 9వ తేదిన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బోధన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బోధన్ పట్టణం పాన్‌గల్లీ పోస్టాఫీస్ నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా శర్బత్ కెనాల్, కొత్త బస్టాండ్, సాత్‌పుల్, శక్కర్‌నగర్ చౌరస్తా నుండి రైల్వేగేట్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీయూసీఐ రాష్ట్ర నాయకులు మల్లేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వరదయ్యలు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలను అనుసరిస్తూ దేశంలోని ప్రజ, కార్మిక, రైతాంగానికి నష్టం కలిగించే విధానాలను అనుసరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాం, నాగేష్, పోశెట్టి, భూషణ్ గౌడ్, నాగయ్య, ప్రభాస్, గంగాధర్, సాయిలు, రాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జల్లాపల్లి ఫారంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



త్రీఫేజ్ మోటారుకు మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం గ్రామంలో ఆదివారం తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామానికి చెందిన త్రీఫేజ్ మోటార్ చెడిపోయి పది రోజులుగా కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త హకీం దృష్టికి తీసుకెళ్లగా తన సొంత ఖర్చులతో బోరు మోటారు మరమ్మతులు చేయించగా తాగునీటి సమస్య పరిష్కారం అయింది. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేరు పాల్గొన్నారు.

పనిగంటలు పెంచుతూ తెచ్చిన జీవోను రద్దు చేయాలి

● ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన

నిజామాబాద్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పనిగంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 282ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌వద్ద ఏఐటీయూసీ నాయకులు పెద్దఎత్తున ర్యాలీతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్దరించాలని 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పనిగంటలను 8 గంటల నుంచి 10 గంటలకు పెంచుతూ జీవో 282ను తీసుకొస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 10 గంటల పనిని రద్దు చేసి 8గంటల పని విధానాన్ని అమలు తెచ్చే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు చక్రపాణి, భాగ్యలక్ష్మి, కవిత, స్వరూప, స్వప్న, లాయక్, కైసర్, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, భానుచందర్, సాయిలు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సభ్యుల ఎన్నిక

కమ్మర్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో ఆదివారం నూతనంగా లయన్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సామాజిక సేవలందించే కార్యక్తలు సమావేశమై క్లబ్‌నూతన పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఆర్మూర్ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్ పర్యవేక్షణలో నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కమ్మర్‌పల్లి లయన్స్‌క్లబ్ తొలి అధ్యక్షుడుగా లుక్క గంగాధర్‌ను, ప్రధాన కార్యదర్శిగా నలిమెల రేవతి గంగాధర్, కోశాధికారిగా తెడ్డు రమేష్, ఉపాధ్యక్షులుగా సున్నం మోహన్, నోములనరేందర్, లైఫ్‌కోఆర్డినేటర్లుగా గోపిడి లింగారెడ్డి, చింత ప్రదీప్. క్లబ్ మెంబర్‌సిప్ చైర్ పర్సన్స్‌గా ఎండి అహమ్మద్ హుసేన్, క్లబ్ మార్కెటింగ్ చైర్‌పర్సన్‌గా బద్దం రాజశేఖర్(బద్రి) డైరెక్టర్‌లుగా కనరక గంగాధర్, ఏలేటి గంగాధర్, పాలెపు నర్సయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షులుగా లుక్క గంగాధర్ మాట్లాడుతు రనున్న రోజుల్లో కమ్మర్‌పల్లి మండలంలో లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

జిల్లా అంతటా ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



యంచలోని ఆలయంలో పూజలు



రుద్రూరు విఠలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బోధన్‌రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదిన పండుగ సందర్భంగా పట్టణంతో పాటు మండలంలోని దేవాలయాల్లో భక్తులు బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో గల విఠలేశ్వర ఆలయానికి సాలూర, హున్స, ఖాజాపూర్ తదితర గ్రామాల నుండి భక్తులు పాదయాత్రతో భజనలు చేసుకుంటూ కాలినడక ఆలయానికి చేరుకున్నారు. అనంతరం విఠలేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఠల.. విఠల.. హరి ఓం విఠలా.. అంటూ భజనలు, కీర్తనలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని మారుతి మందిరం ప్రాంగణంలో గల విఠలేశ్వర ఆలయంలో వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమ్మన్‌పల్లి విఠలేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ తోకల అంజయ్య, కార్యదర్శి కుమ్మరి పోశెట్టి, కొండల్‌వాడి సాయన్న, శంకర్ పంతులు, మనోహర్ జోషి పాదయాత్రగా వచ్చిన భక్తులకు అరటి పండ్లను అందజేశారు. పాదయాత్రగా సుమారు వివిధ గ్రామాల నుండి 250మందికి పైగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు.

రుద్రూరు: తొలి ఏకాదశిని పురస్కరించుకుని రుద్రూరు మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయంతో పాటు మండల పరిధిలోని అంబం(ఆర్), రాయకూర్, చిక్కడ్‌పల్లి, అక్బర్‌నగర్, బొప్పాపూర్, రాణంపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండే స్వామి వారికి ప్రత్యేక పూజలు, మంగళ హారతులు చేపట్టారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాము శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు, మహిళలు, భక్తులు తదితరులఉ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తొర్లికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో, వివిధ గ్రామాలలో గల ఆలయాలల్లో భక్తులు, ప్రజలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాదిలో మొదటి పండగ తొలి ఏకాదశి అయినందున ప్రజలు పిండి పంటలు చేసుకొని ఆరగించారు. ఘనంగా తొలి ఏకాదశి పండుగను ప్రజలు జరుపుకున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని పలుగ్రామాలోని వివిధ ఆలయంలో తొలి ఏకదశి పర్వదినాన్ని ఆదివారం అత్యాంత భక్తి శ్రద్దలతో ఘణంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉదయం భక్తుల సందడి కనిపించింది బారులుతీరి అర్చకులు నిర్వహించిన పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆషాడ సుద్ద తొలి ఏకదశి నుండి హిందువుల పండగలు ప్రారంభమవుతాయని స్థానికులు తెలిపారు.

నవీపేట: మండలంలోని యంచలోని చారిత్రక విఠలేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, భజనలు, కీర్తనలు నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ మందిరం నుండి గుట్టపైన ఉన్న విఠలేశ్వర ఆలయం వరకు దిండి శోభాయాత్ర నిర్వహించారు. సోమవారంఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. యంచ విఠలేశ్వర ఆలయంపైనుండి గోదావరి తీరంతో పాటు రైలు, రోడ్డు బ్రిడ్జిలు, పచ్చని పంట పొలాల దృశ్యాలు భక్తులను కనువిందు చేశాయి.

మెండోర: మండలంలోని మెండోర, పోచంపాడ్, దూదిగాం, వెల్కటూర్, సావెల్, కోడిచర్ల, బుస్సాపూర్, చాకిర్యాల్ , సోన్‌పేట్ గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని నిర్వహించారు. తెలుగు ప్రజలకు తొలి పండుగ ఏకాదశి కావడంతో రోజంతా ఉపవాస దీక్షలను చేపట్టారు. పండగను పురస్కరించుకొని ప్రతీ ఇంటిలో పిండి వంటలు చేసుకున్నారు. ఏకాదశి పర్వదినం కావడంతో మెండోర శ్రీ కళ్యాణ వేంటేశ్వర స్వామి ఆలయం, పోచంపాడ్ శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్‌మండలం ఇస్సాపల్లిలోని శ్రీవెంక టే శ్వరస్వామి ఆలయంలోని ఆదివారం తొలిఏకాదశిని పురస్కరించుకుని సా మూహిక యజ్ఞం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌జీవన్, ఆలయకమిటీసభ్యులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి ఉపవాస దీక్షలు చేపట్టారు. కోటగిరి, పోతంగల్, దోమలెడ్గి గ్రామాల్లోని విఠలేశ్వర ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం పోతంగల్ మండలం నుండి భక్తులు దిండియాత్రతో బీర్కూర్ మండలంలోని భైరాపూర్ శ్రీ రుక్మిణి విఠలేశ్వర మందిరానికి తరలివెళ్లారు. ఏకాదశి ఉపవాస దీక్షలను సోమవారం భక్తులు విరమించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పొమ్మెడి శ్రీనివాస్, అనిల్ కులకర్ణి, కోయగూరి సాయిలు, హన్మాండ్లు, అంజమ్మ పాల్గొన్నారు.



కుమ్మన్‌పల్లిలో పాదయాత్ర చేస్తున్న భక్తులు

మిట్టాపూర్ శివారులో మేకల మందపై చిరుత పులి దాడి

నవీపేట,జూలై6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్ శివారులో ఆదివారం సాయంత్రం చిరుత పులి మేకల మందలపై దాడి చేసి ఒక మేకను తీవ్రంగా గాయపర్చింది. గ్రామానికి చెందిన సాయన్న అనే మేకల కాపరి తన మేకల మందను మేపడానికి సమీపంలో ఉన్న గుట్ట వైపు వెళ్లగా ఆకస్మాత్తుగా చిరుత పులి మందపై దాడి చేయడంతో ఒక మేక తీవ్రంగా గాయపడింది. వెంటనే సమీపంలో ఉన్న వారు గట్టిగా కేకలు వేయడంతో చిరుత పులి పారిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామ శివారులో చిరుత పులి సంచారంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు స్థానికులు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత చిరుత పులిని పట్టుకుని బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గాయపడిన మేకను చూపిస్తున్న మేకల కాపరి

ఘనంగా పీర్ల పండుగ



అర్గుల్‌లో పీరీలను ఊరేగిస్తున్న మైనార్టీలు



ఉప్లూర్‌లోని ఆషీర్‌ఖానాలో ఏర్పాటు చేసిన పీరీలు

బోధన్‌రూరల్,జూలై6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలంలోని పలు గ్రామాలలో మొహర్రం పండుగ సందర్భంగా పీర్లను ఊరేగింపు నిర్వహించారు. పీర్లను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. పీర్ల పండుగలో భాగంగా ఆదివారం 10వ రోజు కావడంతో పీర్లను ఊరేగింపు నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా పీర్ల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. డప్పువాయిద్యాల మధ్య పీర్లు నిర్వహించారు. ప్రజలు మొక్కులు చెల్లించుకున్నారు.

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోటగిరి, యాద్గార్‌పూర్, హంగర్గ ఫారం, పోతంగల్ గ్రామాలలో పీర్లను ఊరేగించారు.

రెంజల్ : రెంజల్ మండల కేంద్రంతో పాటు తాడ్‌బిలోలి, బాగేపల్లి, వీరన్నగుట్ట, నీలా, పేపర్ మిల్, సాటాపూర్, కందకుర్తి గ్రామాలలో ఆదివారం ఘనంగా మొహర్రం పండుగను నిర్వహించుకున్నారు. గ్రామాలలో పీర్లను గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ప్రతి సంవత్సరం మొహర్రం సందర్భంగా మైనారిటీ సోదరులు పీర్లను ఒకచోట కూర్చొబెట్టి ప్రత్యేక పూజలు చేసి మొహర్రం సందర్భంగా గ్రామంలో పీర్లను ఊరేగింపు నిర్వహిస్తారు. పీర్ల చూడడానికి చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లి మండలంలో ఆదివారం మోహర్రం పండుగను ప్రజలు, భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగ జరుపుకున్నారు. అర్గుల్‌లో పీరీలు ఇంటింటికి రాగా భక్తులు, గ్రామస్థులు పీరీలకు మొక్కులు తీర్చుకున్నారు. మునిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో మొహారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు పాషా, బడేమియ, మన్నాన్, ఇంతియాసరొద్దిన్, షైమద్,పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మోహర్రం పర్వదినాన్ని ఉప్లూర్ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. గత పది రోజుల క్రితం గ్రామంలోని ఆషీర్ ఖానాలో రంగురంగుల దట్టీలతో అలంకరించిన పీరీలను ప్రతిష్ఠించి ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు, అంతా మంచి జరుగాలని ప్రత్యేక దువా చేశారు. రాత్రి సమయాల్లో అగ్నిగుండం వద్ద అసైదూలా అడారు, తమ కోరుకుంటున్న కోరికలు నెరవేరాలని కుల మతాలకతీతంగా మొక్కుకుంటు ముడుపులు చెల్లించుకున్నారు. ఆదివారం సాయంత్రం పీరీలను గ్రామంలో మేళతాలాలు డప్పువాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో పీరీలకు చుట్టు నీల్లుపోస్తు మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు మహిళలు, నిర్వహకులు ఊరేగింపులో భక్తిశ్రద్దలతో పాల్గొని పీరీలను దర్శించుకున్నారు. కోలాటాలు వేస్తు ఆశన్న, ఊషన్న; బీఫాతిమా లపై పాటలు పాడుతు అసైదూల ఆడుతు అనంతరం గ్రామ సమీపంలోని నల్ల చెరువు లో పీరీలను నిమజ్జనం చేశారు. మోహారం సందర్భంగా పలు ముస్లీ ఇండ్లలో ఒక్కపోద్దుపాటించడంతో పాటు శర్బత్ పంపిణి చేశారు.



భక్తుల దర్శనార్థం ఉప్లూర్‌లో పీరీలను ఊరేగిస్తున్న దృశ్యం

గోమాతకు అంత్యక్రియలు

నవీపేట,జూలై6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు. హనుమాన్ మందిరానికి చెందిన ఆవు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో గ్రామానికి చెందిన పలువురు యువకులు గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.

కలిగోట్‌లో విద్యార్థులకు క్రీడా దుస్తువుల అందజేత

జక్రాన్‌పల్లి , జూలై.6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు దాతలు ఉట్నూర్ మహేందర్, యూసుప్ విద్యార్థులకు క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. 30 వేల రూపాయల గల క్రీడా దుస్తువులను విద్యార్థులకు వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యుడు పురుషోత్తమ చారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ స్వప్న, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి, విడిసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్ధాపల్లి యువకుడికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం



కర్నాల రామును అభినందిస్తున్న రాష్ట్ర అదనపు డీజీపీ మహేష్ భగవత్

ఆలూర్, జూలై.6 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలం మిర్ధాపల్లికి చెందిన కర్నాల రాము ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ -ఎ ఫలితాల్లో అసిస్టెంట్ కమండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) పదవికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర అదనపు డీజీపీ మహేష్ భగవత్ రామును అభినందించారు. ఈ ఎంపికతో రాము బీఎస్‌ఎఫ్, సీఐఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటి కేంద్ర పారా మిల్ట్రి బలగాలలో డీఎస్పీ స్థాయిలో అసిస్టెంట్ కమండెంట్‌గా నియామకానికి అర్హత సాధించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మిర్ధాపల్లి గ్రామం నుంచి కేంద్ర ప్రభుత్వం ఉద్యోగానికి ఎంపికైన కర్నాల రామును గ్రామస్థులు అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఆదర్శ పాఠశాల 15 మంది విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి , జూలై.6 (ఆంధ్రజ్యోతి): బాసర ట్రిపుల్ ఐటీకి జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో చదువుకున్న 15 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి తెలిపారు. కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న హర్షిక, అక్షయ, లహరి, పూజ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమ చారి, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు.

మోర్తాడ్: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీబాసరలో సీట్లు సంపాదించారని మండల విద్యా.ధికారి సమ్మిరెడ్డి తెలిపారు. తిమ్మాపూర్ పాఠశాలకు చెందిన పీవీ అస్మిత, నల్ల సాయికుమార్, శెట్‌పల్లికి చెందిన విద్యార్థిని సాహిత్య, సుంకెట్‌కు చెం దిన విద్యార్థిని బండిఅనుశ్రీ,అంకంశ్రీహిత, నిహారికలకు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో సమ్మిరెడ్డి ఆ యా పాఠశాలల హెచ్‌ఎంలకు, విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఆర్మూర్ టౌన్, జూలై.6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్నాబాద్ గల్లిలో అంగన్ వాడి శనివారం విద్యార్థులు డాక్టర్ భుజంగొరెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సెల్ ఫోన్‌లు ఇవ్వవద్దని వాటికి అలవాటు పడితే కంటిచూపు సన్నగిల్లుతు ందని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమలో అంగన్‌వాడి టీచర్ పద్మ, ఏఎన్‌ఎం రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ఆర్మూర్‌టౌన్ , జూలై.6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజురియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిఫ్‌లను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్, జిల్లా అధ్యక్షుడు ఎం. నరేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పీడీఎస్‌యూ ఏరియా కమిటి సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుమతులను మంజూరు చేస్తు విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభు త్వం ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు సిద్దం అవుతామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న బోజనంలో నాణ్యత పాటించి మౌ లిక వసతులు కల్పించాలని విద్యార్థులకు ఫ్రీ బస్‌పాస్‌లు ఇవ్వాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ నాయకులు సిద్ధు, బాలాజీ, ఆనంద్, రాహుల్, బాను,గౌతం, రజనీకాంత్, రాజు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ చర్చి కంపౌండ్‌లో శ్రమదానం



శ్రమదానం చేస్తున్న సంస్థ సభ్యులు

ఆర్మూర్ రూరల్, జూలై.6 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో టీచర్స్ కాలనీలోని సీఎస్‌ఐ చర్చి కంపౌండ్‌లో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు, సీఎస్‌ఐ చర్చి కమిటీ సభ్యులు చర్చి కంపౌండ్ ఆవర ణలోని పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, చెత్తచెదారం తొలగించి శుభ్రం చేశారు. అదే విధంగా చర్చి పక్కన గల వంటశాలలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. చర్చికి వెళ్ళే రోడ్లకు ఇరువైపులా పెరి గిన ముళ్ల పొదలను తీసివేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవ స్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రశాంత్, గణేష్, సుంకె నిశాంత్, ఆదిత్య, మధుసుధన్, కృషి వర్ధన్, గుమ్మడి శంకర్, నవనీత్ రాజ్, ప్రభుకిరణ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషి'



కార్యకర్తల సమావేశంలో నూతనంగా ఎన్నికైన బద్దం నర్సారెడ్డి

ఆర్మూర్ -8) ముప్కాల్, జూలై.6 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ముప్కాల్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ముప్కాల్ మండలం కొత్తపల్లిలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయనను బీఆర్‌ఎస్ కార్యకర్తలు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు దాసరి శేఖర్, బద్దం నడ్పన్న, బద్దం రాజారెడ్డి, మారెల్లి విష్ణు, జే. రాజారెడ్డి, చిన్నారెడ్డి, సామెల్, గణపతి, శివ, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘ నూతన కార్యవర్గం

నిజామాబాద్ కల్చరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘ గాజులపేట్ తర్ప నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, కోశాధికారిగా నరేష్, ఉపాధ్యక్షులు చిన్న, శ్రీనివాస్, రాజ్ తిలక్, నరేష్, సలహాదారులుగా బిల్ల బాబు, నర్సయ్య, వెంకటేశం, ఘనపురం దేవేందర్ ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా గోపి, రఘు, రవి, గౌరవ అధ్యక్షులుగా భూమేశ్వర్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకుడు అంబటి నర్సయ్య ప్రకటించారు. నగరంలోని రెండో బోయిడి తర్ప నాయకుడిగా ఈర్ల శేఖర్ ని యామకం అయ్యారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయనను నియమిస్తూ జిల్లాముదిరాజ్ సంఘం ప్రకటిం చింది.



గెలలు వేసిన ఆయిల్ పామ్ పంట



చేపూర్‌లోని ఆయిల్ పామ్ నర్సరీ



ఆర్మూర్ ప్రాంతంలో సాగుచేస్తున్న ఆయిల్ పామ్

ఆయిల్ పామ్ సాగుపై రైతుల ఆసక్తి

● దీర్ఘకాల పంటతో లాభాలు ● ప్రోత్సాహం ఇస్తున్న ప్రభుత్వం

ఆర్మూర్ రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంతంలో రైతులు వరి, పసుపు, మొక్కజొన్న, సోయా పంటలతో పాటు ఆయిల్ పాం పంట సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్‌పాం సాగునకు తక్కువ నీరు అవసరం కాగా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుండడంతో రైతులు ఆయిల్ పామ్ సాగుపట్ల మొగ్గు చూపుతున్నారు. ఆర్మూర్‌లో 5600 ఎకరాలలో పంటను సాగు చేస్తున్నారు. ఈ సంవత్సరం జూన్‌లో 250 ఎకరాలలో పంట సాగుచేయడానికి రైతులు ముందుకు వచ్చారు. సాగుచేసిన 5600 ఎకరాలలో సుమారు 1600 ఎకరాలలో పంట కోతకు వచ్చింది.

వర్షాకాలం సాగుకు అనుకూలం

ఆయిల్ పామ్ పంట వర్షాకాలంలో సాగుకు అనుకూలంగా ఉంటుంది. వర్షాకాలంలో నర్సరీ నుంచి మొక్కలు తీసుకు వచ్చి నాటితే తొందరగా అతుకుంటుంది. రైతులు ఎకరాన వేయి రూపాయల డీడీ తీసి ఇస్తే ఉద్యానవన శాఖ అధికారులు ఎకరానికి 50 మొక్కల చొప్పున అందజేస్తారు. పంట సాగునకు ప్రభుత్వం ప్రభుత్వం ఎకరాన 4200 పెట్టు బడి సాయం కూడా అందజేస్తోంది. అంతేకాకుండా పంట సాగునకు ప్రభుత్వం డ్రిప్పుకు సబ్సిడీ అందజేస్తోంది. డ్రిప్పు పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం సబ్సిడీపై బీసీలకు 9 శాతం సబ్సిడీపై, ఇతర రైతులకు 80 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలను అందజేస్తున్నారు. ఆయిల్ పామ్ మొక్క ఖరీదు 193 రూపాయలు కాగా ఇందులో 173 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీగా అందజేస్తుండడంతో రైతు మొక్కకు 20 రూపాయల చొప్పున మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. పంట మధ్యలో అంతర పంటలుగా బొప్పాయి, జామ, వేరుశనగ, సోయా, పసుపు, కూరగాయల పంటలను సాగుచేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

దీర్ఘకాలికంగా ఆదాయం

ఆయిల్ పామ్ సాగుతో రైతులు దీర్ఘకాలికంగా ఆదాయం పొందవచ్చు. సాధారన పంటలకు అధిక పెట్టుబడులు అవసరం కాగా ఆదాయం అంతంత మాత్రంగానే వస్తోంది. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న రైతులకు నాలుగేళ్ల తర్వాత నుంచి ఆదాయం అధిక మొత్తంలో వస్తోందని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే సుమారు 20 నుంచి 30 ఏళ్ల వరకు పంట దిగుబడి పొందే అవకాశం ఉంటుంది. ఎకరాకు 14 నుంచి 16 టన్నుల వరకు దిగుబడి వస్తుందని దీంతో ఎకరానికి ఏడాది లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆయిల్ పామ్ గెలలను కంపెనీ కొనుగోలు చేస్తుంది..

ఆయిల్ పామ్ పంట కోతకు వచ్చిన తర్వాత పంటను కొనుగోలు చేసేందుకు కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. అంకాపూర్, తిమ్మాపూర్, నందిపేట్, బోధన్, ఇందల్వాయి, రాంపూర్ గ్రావల్లో సేకరణ కేంద్రా లను ఏర్పాటు చేశారు. వీరు గెలల రూపంలో కొనుగోలు చేస్తారు. ఒక్కో గెల నాలుగు నుంచి ఆరు కిలోల వరకు బరువు తూగుతుంది. ఎకరాన తొలి ఏడాది నాలుగు టన్నులు, రెండవ ఏడాది ఆరు టన్నులు పంట దిగుబడులు రాగా ఆరేళ్ల నుంచి సుమారు ముప్పై ఏళ్ల వరకు పది టన్నుల చొప్పున దిగుబడి వస్తోంది. ప్రభుత్వమే ధర నిర్ణయిస్తుంది. పంటను సేకరించిన నాలుగు నుంచి ఏడు రోజుల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తారు. తక్కువ శ్రమ, తక్కువ సాగునీటితో ఆయిల్ పామ్ పంట సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఆయిల్ పామ్ పంట లాభసాటి..
ఎంసీ గంగారెడ్డి, రైతు అంకాపూర్



మూడేళ్ల క్రితం 10 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగుచేశాను. 550 మొక్కలు నాటాను. ఏడెకరాలలో ఇప్పుడిప్పుడే కోతకు వస్తుంది. పసుపు పండించిన భూములు, గతంలో నల్లమట్టి తరలించిన భూములు కావడంతో పంట పెరుగుదల బాగుంది. ప్రతీ రైతుకు నాలుగేళ్ల తర్వాతనే పూర్తి స్థాయిలో అదనపు ఆదాయం వస్తుంది. ఆర్మూర్ ప్రాంత భూముల్లో దిగుబడి అధికంగా వస్తోందని భావిస్తున్నాం. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు లాభాలే వస్తాయి.

రైతులకు ఉపయోగపడని గోదాం

●వ్యవసాయాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటున్న రైతులు
● పూర్తయిన లైసెన్స్ జారీలో అశ్రద్ధ ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



నేరల్ తండాలో నిర్మించిన గోదాం

గాంధారి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరల్ తండాలో ఈ సంవత్సరం రైతులకు ఎరువులు సరాఫరా చేయడానికి సింగిల్ విండో ఆధ్వర్యంలో గోదాం నిర్మాణం చేసిన అందుబాటులోకి మాత్రం రావడం లేదు. గోదాం నిర్మాణ మైనదానికి ఎరువుల సరాఫరా చేయడానికి సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో గోదాం వృథాగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో గాంధారికి వచ్చి ఎరువు లను తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. రైతుల అభి ప్రాయం మేరకు సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. దేవుడి కరుణించిన పూజారి అడ్డుపడుతున్నాడనే సామెత చక్కగా సరి పోతుందని తమకు గోదాం నిర్మాణం పూర్తయిన వ్యవసాయాధికారుల నిర్లక్ష్యంతో వృథాగా ఉంటుందని తెలిపారు. చద్మల్ తండా, చద్మల్, నేరల్, నాగులూర్, నాగులూర్ తండా రైతులకు ఇబ్బందులు ఉండకుండా నిర్మాణం చేపట్టారు. నాలుగైదు రోజులుగా మండల రైతులు ప్రతిరోజు మండల వ్యవసాయాధికారులు లైసెన్స్ గురించి అడుగుతున్న ఎలాంటి స్పందన ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఉన్నామంటూ రైతులను ఎల్లవేళలా ఆదుకుంటా మని ఇబ్బందులు లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నా అధికారులు ఆచరణలో మాత్రం చూపడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే గాంధారి మండలం లో నేరల్‌తండాలో పాటు మాత్ సంగెం, పేట్ సంగెం, గుర్జాల్ గ్రామాల్లో గోదాముల నిర్మాణం చేపడుతున్నారు. మాతుసంగెం గ్రామంలో గతంలోనే నిర్మాణం పూర్తి కావడంతో అక్కడ రైతు లకు అందుబాటులో ఉంది దీంతో అక్కడి నుంచే ఆ గ్రామస్థులు ఎరువుల ను తీసుకుంటున్నారు. నేరల్ తండాలో నిర్మాణం పూర్తయిన అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులైన స్పందించి గోదాంను రైతులకు ఉప యోగపడేలా చూడాలని కోరుతున్నారు.

లైసెన్స్ కోసం ప్రయత్నించినా పట్టించుకోవడం లేదు
- రాథోడ్ నెహ్రూ, సింగిల్ విండో డైరెక్టర్, నేరల్ తండా



నేరల్ తండాలో రైతుల కోసం సింగిల్‌విండో ద్వారా గోదాం నిర్మాణం చేపట్టాం. దీంతో నాలుగైదు గ్రామాల రైతులకు ఎరువులు గాంధారి నుంచి తెచ్చుకోవడం కంటే ఇక్కడే తీసుకోవడంతో ఇబ్బందులు లేకుండా ఉంటుం ది. కాని మండల వ్యవసాయాశాఖాధికారులు గోదాంకు లైసెన్స్ ఇవ్వాలని దరఖాస్తు పెట్టుకున్న ఇప్పటివరకు ఇవ్వలేదు. నాలాంటి ఎంతోమంది రైతులు లైసెన్స్ కోసం అడిగితే పట్టించుకోవడం లేదు.

పేపర్ వర్క్ పూర్తయింది:- రాజలింగం, ఏవో, గాంధారి

నేరల్ తండా గోదాం లైసెన్స్ విషయంలో పేపర్ వర్క్ పూర్తయింది. సింగిల్ విండో వాళ్ల నిర్లక్ష్యంతోనే ఇన్ని రోజులు పెండింగ్ పడింది. సీఈవో ఫోన్ పనిచేయక పోవడం వల్ల వేరే ఫోన్ నంబర్ ఇచ్చారు. మా లాగిన్‌లో పూర్తయింది. రెండు రోజులలో లైసెన్స్ వస్తుంది.

ఫలితాల్లో మిన్న.. సౌకర్యాల్లో సున్నా!

● ధర్మారం(బి) గురుకుల పాఠశాలలో సౌకర్యాలు లేమి ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
● పడిపోయిన ప్రహరీ ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



1986లో ప్రారంభించిన గురుకుల పాఠశాల

డిచ్‌పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న ధర్మారం గురుకుల పాఠశాలలో కొన్నేళ్లుగా సమస్యలు రాజ్య మేలుతున్నాయి. 1986లో ధర్మారం(బి) గురుకుల పాఠశాల 150 మంది విద్యార్థుల కోసం నిర్మించగా ప్రస్తుతం ఆ భవనాల్లో 640మంది ఉంటున్నారు. చాలీచాలని డైనింగ్ హాల్, డ్రెస్సింగ్ హాల్, తరగతి గదులు, మూత్ర శాలలు, మరుగుదొడ్లు, సరిపోక సతమతమవుతున్నారు. పాఠశాల పరిసరాల్లో పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలు పేరుకుపోయాయి. దీంతో దోమల బెడద అధికమైందని విద్యార్థులు తెలిపారు. పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ సంగీత ఇటీవలే నిర్మల్ జిల్లా జామ్‌కు బదిలీ కాగ ప్రస్తుతం మాధవి లత ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు. గురుకుల పాఠశాల సమస్యలు పరిష్కారించాలని అధ్యాపకులు, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు లేఖలు రాసిన సమస్యలు ఏక్కడ వేసిన గొంగడి అనే చందంగా తయారయయ్యాయి. రెండు నెలల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కళాశాలను తనిఖీ సమయంలో సమస్యలపై ప్రిన్సిపాల్ మాధవిలత కలెక్టర్‌కు వివరించారు. 35ఏళ్ల క్రితం నిర్మించిన గురుకుల భవనాలు శిథిలావస్థకు చేరి బీటలు వారాయి. భవనాల్లోని విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైంది. గతంలో సుద్దపల్లి గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థినికి డెంగ్యూ జ్వరం రావడంతో విద్యార్థులు ఆందోళనకు గురిఅయిన విషయం తెలిసిందే. రాత్రి వేళాలల్లో విద్యుత్ సరఫరా పోతే అందకరంలోనే ఉండాల్సిన పరిస్థితి ఉందని జనరేటర్ సదుపాయం ఏర్పాటు చేసేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



విద్యార్థులకు సరిపోని డైనింగ్ హాల్



తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థులు

డైనింగ్ హాల్ నిర్మాణానికి కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతి

640 మంది విద్యార్థులు ఉన్న గురుకులల పాఠశాల కళాశాలలో డైనింగ్ సరిపోక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా డైలింగ్ హాల్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూపతిరెడ్డిలను ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అందని గ్యాస్ సబ్సిడీ

● ఖాతాలో జమ కాని రాయితీ ● మహాలక్ష్మీ లబ్ధిదారుల ఆందోళన
● బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు

ఎల్లారెడ్డి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలో భాగంగా ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సబ్సిడీ పథకం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం సదుపాయం కల్పించిన ప్రభుత్వం మహిళలకు మరింత ఊరట కల్పించేందుకు మహాలక్ష్మీ పథకం పేరుతో రూ.500కే గ్యాస్ పథకం తీసు కొచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు గ్యాస్ బండ ధర సామాన్యుడికి భారంగా మారింది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకం ప్రజలకు మరింత ఊరట నిచ్చింది. ఇందుకు ఎన్నికల ముందు ప్రభుత్వం కొంత మంది లబ్ధిదారులకు సబ్సిడీ నేరుగా జమ చేసింది. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పథకం అమలు ఆగిపోయింది. తరువాత గ్యాస్ సిలిండర్ తీసుకున్న వారికి గ్యాస్ సబ్సిడీ రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ముగిసిపోయి నెల రోజుల పాటు అయింది.

● సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్న వినియోగదారులు

కామారెడ్డి జిల్లాలో గ్యాస్ పథకం కింద హెచ్‌పీ, ఇండియన్, భారత్ తదితర గ్యాస్ కంపెనీలకు చెందిన ఏజెన్సీలు వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల 35 వేల 140 కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీ కింద ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించాల్సిన సబ్సిడీ డబ్బులను ఎన్నిక ముందు వచ్చిన డబ్బులు తప్ప ఎన్నికల అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఈ పథకం సబ్సిడీ రాక గ్యాస్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

● కామారెడ్డి జిల్లాలో 3,35,140 గ్యాస్ కనెక్షన్‌లు

కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ డివిజన్ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో వివిధ గ్యాస్ ఏజెన్సీలు హెచ్‌పీ, ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా 3,35,140 గ్యాస్ కనెక్షన్లు ప్రతీనెల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతుంది. వీటిలో డబుల్ సిలిండర్, సింగిల్ సిలిండర్ల కనెక్షన్లు ఉండగా, దీపం పథకం కింద 60,658 కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద 39,233 కనెక్షన్లు, సీఎస్ఆర్ పథకం కింద 30,867 కనెక్షన్‌లు ఉన్నాయి. మొత్తం కనెక్షన్లకు ప్రతినెల సిలిండర్లు పంపిణీ జరుగుతుంది.

సిద్ధరామేశ్వరనగర్‌లో భజన

భిక్కనూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ హనుమాన్ ఆలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు భజనమండలి ఆధ్వర్యంలో పెద్దఎత్తున భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ భజన మండలి సభ్యులు భక్తిపాటలు పాడుతూ ఈ భజన కార్యక్ర మాన్ని కొనసాగించారు. ఈ మేరకు భజన మండలి సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో ప్రతీ శనివారం ఈ భజన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు.

శనేశ్వరాలయంలో పూజలు

రామారెడ్డి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయంలో ఆవరణలో ఉన్న శనేశ్వరుడి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో ఉన్న ఆలయంలో ప్రత్యేక పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేకంగా పాలాభిషేకం, సంతత ధారాభిషేకం, సిందూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నత్తనడకన రైతుల డిజిటలైజేషన్

● జిల్లాలో ఇప్పటి వరకు 40.51 శాతం నమోదు ● వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు ● ముందుకు రాని రైతులు ● తప్పనిసరి అంటున్న అధికారులు



కోటగిరి రైతు వేదికలో ఫార్మసీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతున్న దృశ్యం

కోటగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా ఆధార్ కార్డు తరహా కార్డు అందించడంతో పాటు పక్క వివరాలు అందుబాటులో ఉంటాయని భావించింది. అయితే జిల్లాలో ఆశించిన మేర ప్రక్రియ ముందుకు సాగడం లేదు. జిల్లాలో సాధారణ పట్టాలు కలిగిన రైతులు 2,91,749మంది ఉండగా ఇప్పటి వరకు 1,18,196మంది రైతులు మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా 40.50శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొన్ని రెవెన్యూ గ్రామాలు ప్రత్యేక యాప్‌లో కనిపించకపోవడం, రైతులకు రెండు, మూడు గ్రామాలలో భూములు ఉంటే ఒక చోట నమోదు చేశాక మిగతవి అయినట్లుగా చూపుతుండడం, వివరాలు కనిపించకపోవడం వంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

● గ్రామాల్లోకి వెళ్తున్న అధికారులు

ప్రస్తుతం రైతుల వివరాల నమోదుకు ఏఈవోలకు అవకాశం కల్పించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లోకి వెళ్లి ప్రత్యేకంగా నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అయితే వర్షాకాలం పంట సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సాగు పంటలకు వెళ్తున్నారు. ఆధార్ సంఖ్యతో అనుసంధానం ఉన్న సెల్‌ఫోన్‌తో రైతులు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మరో వైపు ఒక్కొక్కరి వివరాలు అయితే రెండోసారి ఓటీపీ సరిగా రావడం లేదు. అంతంట ఒకేసారి నమోదు చేస్తుండడంతో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి.

● డిజిటలైజేషన్‌తో అనేక ప్రయోజనాలు

రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్, ఫసల్ బీమా యోజన, ఉద్యాన పంటలకు 60శాతం సబ్సిడీ వంటి పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాలు పొందాలంటే గుర్తింపు తప్పనిసరి అని స్పష్టం చేసింది.

● రాయితీలు పొందే అవకాశం
- ఎంఏ అలీం హైమద్, ఏడీఏ, బోధన్



రైతులు తప్పనిసరిగా ఆధార్ నెంబర్ సెల్‌ఫోన్ నెంబర్‌తో పాస్ పుస్తకానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఈ విషయమై ఉన్నతాధికారుల సూచనల మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రాయితీలు కూడా పొందే అవకాశం ఉంటుంది.

మూల మలుపుల వద్ద జర జాగ్రత్త !

జర దేఖో

● ఏపుగా పెరిగిన చెట్లు ● సూచిక బోర్డులు కరువు ● పట్టించుకోని అధికారులు

ధర్పల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాలు ప్రత్యేకంగా మూలమలుపుల వద్దే కావడం విశేషం. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మూలమలుపుల వద్ద సూచికలు లేకపోవడంతో పాటు రాత్రివేళల్లో రేడియం స్టిక్కర్లు వేయక పోవడంతో మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలు అవుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మూలమలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా గుబురు గుబురుగా చెట్లు పెర గడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలం లోని హొన్నాజిపేట్, వాడి గ్రామానికి వెళ్లే మార్గంలో పలు చోట్ల మూల మలుపులు ఉన్నాయి. చెట్లు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగిన చోట మూల మలుపులు కనిపించని పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంతో పాటు కార్నర్ తండా, నడిమి తండా, కొటాల్‌పల్లి, హొన్నాజిపేట్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మూల మలుపులు చాలానే ఉన్నాయి. ప్రతినిత్యం వందలాది వాహనాలు ఈ మూల మలుపు గుండా నడుస్తున్నాయి. జిల్లా కేంద్రానికి పోవాలంటే ఈ మూల మలుపులను తప్పించుకుంటూ వెళ్లాల్సిందే. మండల కేంద్రంలో నెహ్రూ చౌరస్తాతో పాటు హొన్నాజిపేట్ రోడ్, గాంధీ విగ్రహం వద్ద ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి. మండల కేంద్రం కావడంతో వాహ నాల రాకపోకలు సైతం పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు కనీసం మూల మలుపుల వద్ద సూచికలు ఏర్పాటు చేయక పోవడం గమన్నార్హం. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు సూచిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పలు మార్లు ప్రమాదాలు జరిగినా కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలతో పాటు కాళ్లు, చేతులు విరిగి మంచం పట్టిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద కనీసం సూచికలతో పాటు రాత్రివేళల్లో రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



హొన్నాజిపేట వద్ద ప్రమాదపుకరంగా ఉన్న మూలమలుపు



ధర్పల్లిలో గల నెహ్రూ చౌరస్తా వద్ద మూల మలుపు ఇలా..

● సూచికలు ఏర్పాటు చేయాలి..
మిట్టపల్లి వెంకట్‌రెడ్డి, ధర్పల్లి



ధర్పల్లిలో నెహ్రూ చౌరస్తాతో పాటు హొన్నాజిపేట్‌రోడ్, గాంధీ విగ్రహం మూల మలుపు వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి. సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా ఈ రూట్‌లో వచ్చే వాహనదారులు మూల మలుపులు తెలియకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరు వైపులా గల చెట్లను కొట్టివేసి వచ్చిపోయే వాహనాలు ఏర్పడేలా చూడాలి. ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా సూచికలు, రాత్రివేళల్లో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

పెంపుడు జంతువులకు టీకాలు



కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

మద్నూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో పెంపుడు జంతువులు పెంచుకున్న వారు తమ జంతువులను ప్రభుత్వ పశువైద్యశాలకు తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించారు. ఆదివారం జూనోసిస్ డే సందర్భంగా జంతువుల నుంచి సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్ వ్యాధిగా పేర్కొంటారని ఈ వ్యాధులు సంక్రమించకుండా తాము పెంచుకుంటున్న జంతువులకు వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు దాదాపు రెండు వందల రకాల వ్యాధులు సోకుతాయని పెంపుడు జంతువుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుందని యజమానులు తాము పెంచుకుంటున్న జంతువులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ట్రాక్టర్‌ను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

మద్నూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి మండలం నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని మద్నూర్ పోలీసులకు అప్పగించినట్లు డోంగ్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తెలిపారు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో పొతంగల్ మంజీరా పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని తహసీల్దార్ కార్యాలయం డోంగ్లిలో పెట్టామన్నారు. ఆ తరువాత మద్నూర్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా అడ్డుకట్ట వేయడానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశాల మేరకు రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

బాన్సువాడ నుంచి తీర్థయాత్రలకు బస్సు

బాన్సువాడటౌన్ , జూలై 06 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ డిపో నుంచి ఈ నెల 10 గురువారం జరాసంగం, బీదర్ నరసింహస్వామి, గానగాపురం తీర్థయాత్రకు డీలక్స్ బస్సు బయలుదేరనున్నట్లు డిపోమేనేజర్ సరితాదేవి తెలిపారు. బాన్సువాడ నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభమై తిరిగి రాత్రి 12 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని ఆమె తెలిపారు. పెద్దలకు 1300 , పిల్లలకు 650 రూపాయల టికెట్టు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు 9063408477 గోపికృష్ణను సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

‘సమాజంలో గురుస్థానం పవిత్రమైనది’

పిట్లం, జూలై 6 : తల్లితండ్రులు జన్మనిస్తే గురువు మనకు జీవిత పాఠాలను బోధించి సరైన మార్గంలో నడిపించేది గురువేనని కామారెడ్డి జిల్లా ప్రచారక్ ప్రకాష్‌జీ పేర్కొన్నారు. ఆదివారం ఆర్యవైశ్య సంఘంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రచారక్ హాజరై స్వయం సేవక్‌సంఘ్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పెద్దలు కోటరాజులు, సంతోష్, అంబదాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఘనంగా ఏకలవ్య జయంతి



బీర్కూర్‌లో ఏకలవ్య జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకలవ్యుడి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం అధ్యక్షుడు కుతడి పెద్ద సాయిలు, ఏఎంసీ వైస్ చైర్మన్ యామరాములు, మాజీ ఎంపీపీ రఘు, ఇంగురాములు, మాజీ ఉప సర్పంచ్ దులిగా కిషన్, కుతడి బ్రహ్మయ్య, బాలయ్య, రాజు, మానేపురం సాయి, దులిగా రాజు, పోచయ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లింగంపేటలో పీర్ల పండుగ



పీరీల ముందు దులా ఆడుతున్న యువకులు

లింగంపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం పీర్లపండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధానవీధుల గుండా పీర్లను ఉరేగించారు. భక్తులు పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని లాల్ సహాబ్, ఖాసీమ్‌దూలలతో పాటు పలు పీరలను భక్తులు దర్శించుకున్నారు. పీరిల ముందు యువకులు పాటలు పాడుతూ దులా ఆడారు.

బాధితులకు ఆర్థికసాయం

బాన్సువాడటౌన్ , జూలై 06 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అంకంపల్లి గ్రామానికి గ్రామానికి చెందిన ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రాజేశ్ గత నెల 30న రోడ్డుప్రమాదంలో మరణించాడు. దీంతో ఆయన కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. అయితే బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు బాన్సువాడ పట్టణ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు స్పందించి సుమారు 51 వేల రూపాయలను జమ చేశారు. ఎంఈవో నాగేశ్వరరావు తన సిబ్బందితో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అంకంపల్లి గ్రామానికి చేరుకుని రాజేశ్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. 51వేల రూపాయల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట దాసరి రవీందర్ , మంద ప్రవీణ్ , భాను , నాగార్జున తదితరులున్నారు.

చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బిచ్కుంద, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యాపూర్ గ్రామ శివారులో జ్ఞానేశ్వర్ అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. కుటుంబతగాదాలతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి గ్రామశివారులో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ వితరణ

లింగంపేట, జులై 6 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట గ్రామపంచాయితీకి ఆదివారం 1998-99 బ్యాచ్ పదవ తరగతి పూర్వవిద్యార్థులు బాడి ఫ్రీజర్‌ను వితరణ చేశారు. ఇటీవల వారు ఏర్పాటు చేసుకున్న సమ్మేళనంలో సమాజనాకి తమ వంతుగా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నామని అందుకు గాను తాము చదువకున్న పాఠశాలకు రూ.10వేలు విలువగల బ్లూటూత్ సౌండ్ బాక్స్‌ను ఇచ్చామని, బాడిఫ్రీజర్ లేక ఇబ్బంది పడుతున్నారని గ్రహించి గ్రామానికి తమ వంతుగా రూ.50వేల విలువ చేసే బాడీ ఫ్రీజర్‌ను అందజేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, పూర్వవిద్యార్థులు శ్రీకాంత్, మహేష్, సాయిలు, కృష్ణమూర్తి, శ్రీధర్, స్వామి, నరెందర్, సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



మద్నూర్ విఠలేశ్వరాలయంలో భక్తుల పూజలు



బీర్కూర్‌లో చిన్నారులకు బెల్లంతో తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడటౌన్ , జూలై 06 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు ఆదివారం తొలిఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. విఠలేశ్వరాలయం, శ్రీరామ మందిరంలతో పాటు ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి అర్చకులు స్వామివారికి అభిషేకాలు, అర్చన చేశారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో స్వామి వారిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఏకాదశి సందర్భంగా ఉపవాసదీక్ష చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు , భక్తులు తదితరులున్నారు.

మద్నూర్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తెల్లవారుజాము నుంచి మండలంలోని ఆయా గ్రామాలలోని విఠలేశ్వర, ఆలయాలతో పాటు వెంకటేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొలిఏకాదశి పండగను పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేశారు.

పిట్లం : విఠలేశ్వర ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పండుగ సందర్భంగా భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. తొలిఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు విఠలేశ్వర ఆలయానికి పచ్చని తోరణాలు, పూలతో అలంకరణ చేశారు. పండితులు పత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బీర్కూర్ : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానం, బైరాపూర్ గ్రామంలోని రుక్మిణి విఠలేశ్వర ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి వారిని. అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు కఠినమైన ఉపవాసదీక్షలు ఆచరించారు. ఇదిలా ఉండగా టీటీడీలో భక్తులు స్వామివారి సన్నిధిలో చిన్నారులకు తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. తొలి ఏకాదశి పండగ సందర్భంగా బైరా పూర్ గ్రామంలోని రుక్మిణి విఠలేశ్వర ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శిం చుకున్నారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా రుక్మిణి విఠలేశ్వర స్వామి వారిని దర్శించు కునేందు కోసం బోధన్, కోటగిరి, పొతంగల్ మండ లాలు, పరిసర గ్రామాల నుంచి భక్తులు పాదయా త్రగా తరలివచ్చారు. అయితే లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాదయాత్రికులకు పండ్లు, పాలు, తాగునీరు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమేష్, బీర్కూర్ జోన్ చైర్మన్ లయన్ సంతోష్ కుమార్, లింగప్ప, విజయేందర్ రెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలో తొలిఏకాదశి పండుగను మండల ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమర్లబండ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పూజారీ గిరీష్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని 12గంటల పాటు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజయ్య వేద బ్రాహ్మణుడు సంతోష్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సనాతన భజనమండలి సభ్యులు స్వామి వారి గీతాలాపనలతో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

భిక్కనూరు : మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రజలు తొలిఏకాదశి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ప్రజలు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చు కున్నారు. ఈ సందర్భంగా పండివంటలను చేసుకుని ఆరగించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలు కిక్కిరిసిపోయా యి.

లింగంపేట : మండల కేంద్రంతో పాటు మండలంలోని మెంగారం, శెట్పల్లి, ఐలాపూర్, భవానిపేట, మోతె, పొల్కంపేటలతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం తొలిఏకాదశి వేడుకలు భక్తి శ్రద్ధలతో భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున దేవతా మూర్తులకు పంచామృత స్నానం, పట్టు వస్త్రాలను సమర్పించి పురోహితుడు రంగచారి పూజలు నిర్వహించారు. రామాలయంలోను భక్తులు పెద్దసంఖ్యలో పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

రామారెడ్డి : శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం తొలిఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి, శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలంలోని మద్దికుంట అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, రెడ్డిపేట్ సాయిబాబా ఆలయం, పోసానిపేట్ రాజరాజేశ్వరాలయం, ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వివిధ రకాల వంటలు చేసి భోజనాలు చేశారు. ప్రత్యేక పూజలు పాటలతో చిన్న పెద్ద తేడా లేకుండా ఇంట్లో ఉన్న దేవుళ్లకు మొక్కులు మొక్కారు. వర్షాకాలంలో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని దేవుళ్లకు మొక్కులు మొక్కుకున్నారు.



ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రిమాండ్

● పేలుడు పదార్థాలైన జిలిటెన్‌స్టిక్ నిల్వ ఉంచడంపై కేసు

కామారెడ్డి, జూలై 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని పేలుడు పదార్థాలైన జిలిటిన్ స్టిక్‌లను అక్రమంగా నిల్వ ఉంచారనే కేసులో పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదేకేసులో అతని సోదరుడు సురేందర్‌రెడ్డిపై సైతం కేసు నమోదు కాగా ఆయన పరారీలో ఉన్నట్లు తెలిసింది. పట్టణంలోని కేపీఆర్ కాలనీలో ఓ ఖాళీస్థలంలో బండరాళ్లను పగలగొట్టేందుకు పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్‌లను నిల్వ ఉంచారని పోలీసులకు సమాచారం అందడంతో రెండ్రోజుల క్రితం విచారణ చేపట్టి నలుగురిని అరెస్ట్ చేశారు. విచారణలో వారు ఇచ్చిన సమాచారంతో కామారెడ్డి పట్టణ శివారులోని లింగాపూర్‌లో చంద్రశేఖర్‌రెడ్డికి సంబంధించిన ఓ వెంచర్‌లో బండరాళ్లను పగలగొట్టేందుకు కొందరు వ్యక్తుల చేత ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దమొత్తంలో నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్‌లు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. శనివారం గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. చంద్రశేఖర్‌రెడ్డి రిమాండ్, అరెస్ట్ చేయడాన్ని ఆయన భార్య మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తీవ్రంగా ఖండించారు. తన భర్తపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి రిమాండ్ చేశారంటూ ఆమె ఆరోపించారు.

ఎస్సైని సన్మానించిన యూత్‌కాంగ్రెస్ నాయకులు

పెద్ద కొడప్‌గల్, జూలై 06 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అరుణ్‌కుమార్‌ను ఆదివారం యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గతంలో పెద్దకొడప్‌గల్ ఎస్ఐగా మహేందర్ పనిచేయగా, ఆయన స్థానంలో అరుణ్‌కుమార్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐని యూత్ కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

పెద్దకొడప్‌గల్, జూలై 06 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో వసతిగృహ విద్యార్థులకు యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతా రావ్ గెలిచిన నాటి నుంచి జుక్కల్ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తూ జుక్కల్‌ను ప్రగతి పథంలో తీసుకెలుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో చెరగని ముద్ర వేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల యూత్‌నాయకులు, వసతి గృహ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నూతన చైర్మన్‌కు సన్మానం

దోమకొండ, జూలై 06(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ చాముండేశ్వరీ దేవాలయ నూతన చైర్మన్‌గా ఎన్నికైన పెద్దిరెడ్డి సిద్దారెడ్డిని ఆదివారం దోమకొండ గ్రామస్థులు శాలుతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కర్రోల్ల శ్యాంగౌడ్, స్వామిగౌడ్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

● జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్

పిట్లం, జులై 6 : గత పాలకుల హయాంలో రాష్ట్రం అప్పులపాలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం సాయిగార్డెన్‌లో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే జన్మదినం వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా విచ్చేసి, పిట్లం లో బైక్‌ర్యాలీలో పాల్గొని సాయి గార్డెన్‌కు చేరుకున్నారు. నియోజకవర్గనాయకులు ఎమ్మెల్యేకు జన్మదినం సందర్భంగా శాలువాలు, పూలతో సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల లో ఇచ్చిన హామీలను అంచెలంచెలుగా అమలు చేశామని, రైతులకు రైతుభరోసా, రుణమాఫీ, సన్న రకాలకు బోనస్ ఇచ్చామన్నారు. నియోజకవర్గానికి 3500 ఇంది రమ్మ ఇల్లు మంజూరు కాగా, ఆదనంగా 3500 ఇల్లు మంజూరు చేయించానని, నాగమడుగు ఎత్తిపోతల పథకం రీ డిజైన్‌తో బీడుభూములకు సాగునీరు అందిస్తామని, లెండి ప్రాజెక్ట్ పనులు త్వరగ తిన పూర్తవుతాయని, జుక్కల్ ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సేవలంది స్తానన్నా రు. జుక్కల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా నన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మెన్‌లు, విండో చైర్మెన్‌లు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దాం

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంథని సామ్యేల్ మాదిగ



నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

రామారెడ్డి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని డా.బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా రామారెడ్డి మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మంథని సామ్యేల్ మాదిగ మాట్లాడారు. భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొన సాగిద్దామని పిలుపునిచ్చారు. భారత దేశంలో డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ రిజర్వేషన్లను కల్పిస్తే బాబు జగ్జీవన్ రామ్ తన జీవిత కాలమంతా రిజ ర్వేషన్ల పరిరక్షణకు పూనుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రామా రెడ్డి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇనుగుర్తి రాజనర్సు, నాయకులు కొత్తోల్ల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, ఎమ్మా ర్పీఎస్ నాయకులు కొత్తూరు సాయిలు, కాస్తారి శైలేష్ మాదిగ, చింతకుంట సాయి వరుణ్, ఇనుగుర్తి శ్రీనివాస్, పద్మ, నారాయణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం భయం

(5వ పేజీ తరువాయి)

ఎడిస్ ఈజిప్టై(టైగర్‌మస్కిటో) అనే దోమ కాటు కారణం. ఈ దోమలు ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే కుడతాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల సమయంలో కుట్టడం వల్ల ఈ వ్యాధి సోకే సూచనలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కుట్టిన రెండు, మూడు రోజుల్లోనే వ్యాధికి సంబంధించిన లక్షణాలు కనబడుతాయి. విపరీతమైన జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఏర్పడుతాయి. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచే తెల్లరక్త కణాలపై దాడిచేస్తాయి. దీంతో వ్యాధి సోకిన వారు నీరసించిపోతారు. దోమ మనిషిని కుట్టిన తర్వాత జ్వరంతో పాటు వారి శరీరంలో చిన్న చిన్న ఎర్రని చెమట కాయలాంటి పొక్కులు కన్పిస్తాయి. మరికొంత మందికి చర్మంపై వచ్చిన విధంగానే కడుపులో వస్తాయి. ఇది గుర్తించాలంటే మల విసర్జన సమయంలో రక్తం జీరలు వస్తున్నాయో లేదో గమనించాలి. ఈ రెండు రకాల పరిస్థితులు ఉంటే ఎలిసా టెస్ట్ ఫర్ డెంగీ పరీక్షను చేయించుకోవాలి. పీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రిని సంప్రదిస్తే జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపి నిర్ధారణ అయితే దానికి తగిన యాంటి బయోటిక్స్, ఫ్లూయిడ్స్‌లను వైద్యులు అందిస్తారు. వ్యాధి ముందరక ముందే తగిన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు.

ముందస్తు చర్యలు

వర్షాలు ఆరంభమయ్యాక ఇంటి పరిసరాలు, మురికి గుంటలు, కొబ్బరి బొండాలు లాంటి వాటిలో నీరు నిలువకుండా చూసుకోవాలి. అలా నీరు నిలువవుండడం వల్ల దోమల సంతతి పెరుగుతోంది.దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా, డెంగీ లాంటి వ్యాధులు సంభవిస్తాయి. ఈ ఏడాది గత ఏడాదిలాగా కాకుండా ముందస్తుగానే జూలై నెల నుంచి జిల్లా వైద్యాధికారులు క్యాంపులు నిర్వహించి ప్రజలు ఈ వ్యాధి భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెబుతున్నా వ్యాధి మాత్రం చాప కింద నీరుల విస్తరిస్తోంది. ఈ రోగులకు సంబంధించిన మందులు, దోమల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ప్రజలు సహకరించి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడమే ఈ వ్యాధికి నివారణ మార్గం అని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం

● చంద్రశేఖర్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

వర్షకాలం నీటి కుంటలలో దోమలు గుడ్లు పెట్టడం వల్ల వాటి వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇంటి పరిసరాల్లో నీరు నిలవ ఉండకుండా చూసుకోవాలి. నీరు నిలిచినట్లయితే బ్లీచింగ్ పౌడర్ లాంటి వాటిని చల్లాలి. దీంతో కొద్దిరోజులుగా నీటిపై నిల్వ ఉన్న దోమలు మృతి చెందుతాయి. డెంగీ వ్యాధి కట్టడికి గ్రామాలను, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఏమైన లక్షణాలు కనిపిస్తే తక్షణమే పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. వారు శాంపిళ్లను సేకరించి జిల్లా కేంద్రంలోని టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపుతారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సను అందిస్తారు.

మంత్రి గారూ.. రోడ్లను బాగు చేయరూ..!

(5వ పేజీ తరువాయి)

రహదారుల నిర్మాణానికి అడ్డంకిగా అటవీ చిక్కులు

జిల్లాలో పలు రోడ్ల నిర్మాణాలకు అటవీశాఖ అనుమతులు లభించకపోవడంతో నిధులు ఉన్నా దశాబ్దాలుగా పనులు పూర్తికావడం లేదు. లింగ ంపేట మండలంలోని పోతాయిపల్లి నుంచి తాడ్వాయి మండలం నందివాడకు అటవీ ప్రాం తం నుంచి రోడ్డు నిర్మాణానికి గతంలోనే నిధులు మంజూరయ్యాయి. రెండు గ్రామాల్లో అటవీ ప్రాంతాల వరకు పనులు చేపట్టారు. అటవీ అనుమతులు లేకపోవడంతో మూడు కిలో మీటర్ల మేర పనులు ముందుకు కదలడం లేదు. అదేవిధంగా కామారెడ్డి నుంచి రామారెడ్డి మీదు గా రెడ్డిపేట వరకు అటవీ అనుమతులు లేక ఏళ్లుగా పనులు కొనసాగడం లేదు. రాజంపేట మండలం ఆర్గోండ, కొండాపూర్ గ్రామాల మధ్య ఐదు కిలో మీటర్ల మేర అటవీ ప్రాంతంలో అనుమతులు లేక పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

నేడు జుక్కల్‌లో పర్యటించనున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నేడు జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పిట్లం మండలంలోని మద్దెల చెరువు వద్ద కొత్తగా మంజూరైన హైలెవల్ బ్రిడ్జి పనులను శంకుస్థాపన చేయనున్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి స్థానికంగానే బహిరంగ సభలో పాల్గొననున్నారు. అనంతరం జుక్కల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు.

‘సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం’

కామారెడ్డిటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి రోటరీ క్లబ్ ఆడిటోరియంలో ఆదివారం రోటరీక్లబ్ ఇన్‌స్టలేషన్ డేను ఘనంగా నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి కామారెడ్డి రోటరీక్లబ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తకమిటీ అధ్యక్షునిగా శంకర్, సెక్రెటరీగా కృష్ణహరి, కోశాధికారిగా వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ గవర్నర్‌లు మాట్లాడుతూ రోటరీక్లబ్ అనేక సేవ కార్యక్రమాలు ఇంతకముందు చేసిందని, ప్రభుత్వ పాఠశాలల్లో డెస్క్‌లు, టాయిలెట్స్, స్ట్రెచర్ బెడ్స్, పేదమహిళలకు కుట్టుమిషన్‌లు, వికలాంగులకు వీల్‌చైర్స్, అమ్మాయిలకు సైకిల్స్ వంటివి అందించామని తెలిపారు. రోటరీలో లక్షలమంది సభ్యులు ఉన్నారని, పోలియో నివారణలో అతిముఖ్యపాత్ర పోషించిన రోటరీ విద్యా, వైద్యంతో పాటు సామాజిక సేవా, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు వెళ్తుందని దీనిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ నామిని హరిహరప్రసాద్, గెస్ట్ ఆఫ్ హనర్‌గా పీడీసీ హనుమంత్‌రెడ్డి, స్పెషల్ గెస్టుగా అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్‌రెడ్డి,సుభాష్‌జైన్, సుధాకర్, పున్నరాజేష్, ధనంజయ్, డాక్టర్ బాలరాజు, డాక్టర్ విజయ్‌కుమార్, అమర్,సంతోష్,దత్త్రాద్రి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

